పౌర రక్షణ అప్రమత్తతపై సిఎం చంద్రబాబునాయుడు బుధవారం జిల్లా కలెక్టర్లు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ శోభిక, ఎస్‌పి మాధవరెడ్డి హాజరయ్యారు.

మెటల్ వేసి మధ్యలో పనులు ఆపేసిన రహదారి

గిరిజన తండాల్లో రహదారులు దారుణంగా మారాయి. కొన్ని రహదారులు రాళ్లు తేలిపోతే, మరికొన్ని రోడ్లు అర్ధాంతరంగా నిధులు లేక నిలిచిపోయాయి. ఇంకొన్ని రహదారులు అటవీశాఖ అభ్యంతరాలు తెలపడంతో ఆగిపోయాయి. ప్రభుత్వాలు మారినా గిరిజనుల రహదారి సమస్య మాత్రం అలాగే ఉండిపోతోంది. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందు రహదారి ఉండాలి. అత్యవసర సమయంలో అంబులెన్స్, అగ్నిమాపక శకటం వంటివి వెళ్లాలంటే రహదారి తప్పనిసరి. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో మరింత దారుణంగా ఉంటుంది. అలాంటిది ఇప్పటికీ గిరిజన గ్రామాల్లో రహదారులు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రహదారులు దారుణం

- ఏజెన్సీలో అధ్వానంగా రోడ్లు
- పనులు అర్ధాంతరంగా వదిలేసిన వైనం
- రాళ్లు తేలిన రహదారులతో అవస్థలు
- నిత్యనరకం అనుభవిస్తున్న గిరిజనం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో కనీసం 150 రహదారులు వరకు వేయాల్సి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని 20 మండలాల్లో 104 రహదారులకు ప్రతిపాదనలు పంపించారు. సీతంపేట ఏజెన్సీలో బెనరాయి జలపాతానికి సిసి రహదారికి అటవీశాఖ అభ్యంతరాలు తెలపడంతో నిలిచిపోయింది. భామిని మండలంలో కోటకొండ నుంచి మనీగ రహదారి కూడా అటవీ శాఖ అభ్యంతరం వల్లే ఆగిపోయింది. శ్రీకాకుళం జిల్లాలో కూడా కొన్ని రహదారులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి.

సీతంపేట ఏజెన్సీలో పివి ఈతమానుగూడ పంచాయతీలో సలభంపాడు నుంచి కొత్తగూడ, తుంబలి నుంచి సన్నాయిగూడ రహదారులు మెటల్ వేసి వదిలేశారు. రాజుగాడిగూడ నుంచి గూడంగి మూడు కిలోమీటర్లు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారు. పులిపుట్టి నుంచి జరడ కాలనీ మీదుగా చిన్నబగ్గ ప్రధాన రహదారి వరకు రాళ్లు తేలిన రోడ్డుపై నడవాల్సిన దుస్థితి దాపురించింది. ముకుందపురం రోడ్డుకు రాళు వేసి వదిలేశారు. దోనుబాయి పంచాయతీలో కోదులు వీరఘట్టం నుంచి దాసుగుమ్మడ, అంబలకండి, కుసుమూరు నుంచి చెక్కాపురం, మేకవ నుంచి రూపాయి వరకు రహదారులు లేకపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. సామరెల్లి నుంచి పుప్పాడ, గెద్దకోల నుంచి పెదపల్లకివలస లింక్ రోడ్లు వేయాల్సి ఉంది. దుగ్గి నుంచి వనిజ రహదారి వేస్తే సీతంపేట, జియ్యమ్మవలస మండలాల గిరిజనులకు ప్రయోజనం చేకూరుతుంది. దబర నుంచి దబరగూడ రహదారి అర్ధాంతరంగా నిలిచిపోయింది.

దారపాడు పంచాయతీలో దంజుపాయి నుంచి భూతాలగూడ రోడ్డు 2017లో సగం చేసి వదిలేశారు. ఇంతవరకు పూర్తి చేయలేదు. గోలుకుప్పగూడ నుంచి రామానగరం గెడ్డ వరకు బిటి రోడ్డు పెచ్చులూడిపోయింది. రాళ్లు తేలి దారుణంగా తయారైంది. దీంతో ఆదివాసీలకు ఇబ్బందులు తప్పడం లేదు. గోలుకుప్పగూడ నుంచి జగత్‌పల్లి, దిశరగూడ వరకు రోడ్డు పనులు ప్రారంభించి, మధ్యలో వదిలేశారు. ఏడాది గడుస్తున్నా పూర్తి చేయలేదు. ఆడలి నుంచి పొంజాడ వరకు గతంలో రోడ్డు ప్రారంభించి, వదిలేయడంతో వర్షాలకు కొట్టుకుపోయింది. కోడిశా జంక్షన్ నుంచి కడగండి వరకు బిడి రోడ్డు మరమ్మతులకు గురైంది. ఈ రోడ్డు వేస్తే నాలుగు మండలాలకు ప్రయోజనం చేకూరుతుంది. మర్రిపాడు నుంచి పూతికవలస వరకు బిటి రహదారి మరమ్మతులకు గురైంది. దుగ్గి నుంచి రాయిలంక వరకు రాళ్లు తేలిన రహదారిపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముత్యాలు జంక్షన్ నుంచి కోతాం రహదారి సగం చేసి వదిలేశారు.

రాళ్లు తేలిన జరడకాలనీ రోడ్డు

పూతికవలస రోడ్డుపై ఏర్పడిన గోతులు

రాళ్లు తేలిన రహదారిపై నడవలేం

గిరిజన గ్రామాలకు రహదారి లేకపోవడంతో రాళ్లు తేలిన రహదారిపై నడవాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అటవీ ఉత్పత్తులు సంతకు తీసుకొని వెళ్లలేని పరిస్థితి.

– కూరంగి వెంకినాయుడు, సర్పంచ్, దోనుబాయి

రహదారులు వేయాలి

ఏజెన్సీలో రాళ్లు తేలిన రహదారిపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఐటిడిఎలో రోడ్లు వేయాలని అధికారులకు వినతులు సమర్పించాం. రహదారి లేని గిరిజన గ్రామాలకు రోడ్లు వెంటనే మంజూరు చేయాలి. సగం పనులుచేసి వదిలేసిన రహదారులను పూర్తి చేయాలి.

– జీలకర్ర సుందరమ్మ, సర్పంచ్, ధారపాడు

104 రహదారులకు ప్రతిపాదనలు

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 20 మండలాల్లో 104 రహదారులకు రూ.10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అందులో పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు మండలాల్లో 82 రహదారులు, శ్రీకాకుళం జిల్లాలో 16 మండలాల్లో 22 రోడ్లు ఉన్నాయి. నిధులు మంజూరైతే రెండేళ్లలో పూర్తి చేస్తాం.

–పి.రమాదేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఐటిడిఎ, సీతంపేట

గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీ ఆత్మగౌరవ ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు , నాయకులు

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన ర్యాలీ, సభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన గుమ్మలక్ష్మీపురంలో బుధవారం ఆదివాసీ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు గిరిజనుల నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. అనంతరం వైటిసి వద్ద ఏర్పాటు చేసిన సభలో వక్తలు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 3కు ప్రత్యామ్నాయంగా కొత్త జిఒ తీసుకువచ్చి నూరు శాతం ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు గిరిజనులకే కల్పించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, ఆదివాసీ జెఎసి జిల్లా చైర్మన్ కొండగొర్రి ధర్మారావు, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవ రాజు, జిల్లా చైర్మన్ ఆర్.ఎస్.వరహాల దొర, జెఎసి నాయకులు ఇంటికుప్పల రామకృష్ణారావు, దుక్క సీతారాం, చంద్రశేఖర్, ఎంపిపి దీనమయ్య, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు సత్కారం

ప్రజాశక్తి-సీతంపేట

విద్యార్థి జెస్సీని సత్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

మండలం లోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.జస్సీ పదో తరగతిలో 579 మార్కులు సాధించి, రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచింది. దీంతో బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆ విద్యార్థిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సత్కరించారు. జస్సీతోపాటు హెచ్‌ఎం బి.ఉమావాణికి మెమొంటో, రూ.20 వేలు నగదు బహుమతిని అందజేశారు. అదే పాఠశాలకు చెందిన ఎన్.మాధురి రెండో స్థానంలో నిలిచి, మెమొంటో అందుకుంది. ఉత్తమ గణిత ఉపాధ్యాయులుగా బి.రోజాను అభినందించారు.

12న డిఇఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

పాఠశాల విద్యావ్యవస్థలో అసంబద్ధాలను తొలగించాలని కోరుతూ ఈనెల 12న డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిఒ నంబర్ 117 రద్దు చేస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆ జిఒ అనుగుణంగా పాఠశాలల ఎత్తివేతకు దారి తీసే విధంగా ప్రాథమిక పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేస్తున్నట్లు తెలిపారు. హైస్కూళ్లలో విద్యాహక్కు చట్టం ప్రకారం 1:40 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 ప్రకారం ఎస్‌జిటిలను నియమించాలని కోరారు. యుపి పాఠశాలలను కొనసాగించి స్కూల్ అసిస్టెంట్లను కేటాయించాలని కోరారు. ఎస్‌జిటిల బదిలీ కౌన్సిలింగ్ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పండగ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సాలూరు

శ్యామలాంబ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌డిసి ధర్మచంద్రారెడ్డి

పట్టణంలో ఈ నెల 18,19,20 తేదిలో జరిగే శ్యామలాంబ అమ్మవారి పండుగ ఏర్పాట్లను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. తొలుత శ్యామలాంబ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయం ప్రాంగణాన్ని పరిశీలించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆలయ వెనక భాగాన మైదానంలో మంచినీరు, మజ్జిగను సరఫరా చేయాలని దేవాదాయ అధికారులను ఆదేశించారు. ఆలయం చుట్టూ చేపడుతున్న ఫ్లోరింగ్ వర్క్‌ను, పరిసరాలను పరిశీలించారు. తరువాత అల్లువీధి వద్దనున్న అమ్మవారి సినిమానును పరిశీలించారు. సిరిమాను తిరిగే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. పండుగ సందర్భంగా వాహన పార్కింగ్ స్థలాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డిటివి.కృష్ణారావు, తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఎంపిడిఒ పార్వతి, డిఇ ప్రసాద్ రావు, శివకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సీతంపేటలో వర్షం

సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట : మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గత రెండు రోజులు తీవ్రమైన ఎండలు ఉండటంతో ప్రజలు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడ్డారు. మరోపక్క ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. బుధవారం ఉదయం ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం అయ్యేసరికి వాతావరణం చల్లబడింది. ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించింది.

జిఒ 3పై మాట నిలబెట్టుకోవాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కాల్సిన జిఒ నంబర్ 3 పునరుద్ధరణపై గత ఎన్నికల్లో టిడిపి కూటమి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో షెడ్యూల్ గ్రామాల ప్రకటనపై కొన్ని గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టిన సమయంలో అప్పటి మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ వారికి స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వస్తే షెడ్యూల్ గ్రామాల సమస్య పరిష్కరిస్తామని టిడిపి నాయకులు చెప్పారని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించి జిఒ నంబర్ 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంతవరకు హామీ అమలుపై స్పష్టత లేదన్నారు. ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జిఒ నెంబర్ 3 రద్దుకు గత వైసిపి ప్రభుత్వం కారణమంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలోనే జిఒ 3 రద్దు కోరుతూ చేబ్రోలు లీలా ప్రసాద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని చెప్పారు. అయితే 2020లో సుప్రీంకోర్టు జిఒ 3ను రద్దు చేస్తూ తీర్పునిచ్చిందని తెలిపారు. దీనిపై అప్పటి వైసిపి ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. టిడిపి ప్రభుత్వం హయాంలోనే సరైన న్యాయవాదితో సుప్రీంకోర్టులో వాదన వినిపించి ఉంటే జిఒ 3 రద్దయ్యేది కాదన్నారు. తమ ప్రభుత్వం హయాంలో ఆర్డినెన్సు ద్వారా జిఒ 3ని పునరుద్ధరణ చేయాలని ప్రయత్నించామని, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినందున ఆర్డినెన్సు తీసుకురావడం కుదరదని న్యాయనిపుణులు సూచించారని చెప్పారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఆర్డినెన్సు ద్వారా జిఒ 3ని పునరుద్ధరణ చేయొచ్చని సలహానిచ్చారు. ఇటీవల మంత్రి సంధ్యారాణి గిరిజన సంఘాల నాయకులతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఈ నెల 8న జరిగే మంత్రివర్గ సమావేశంలో జిఒ నెంబర్ 3 పునరుద్ధరణ, స్పెషల్ డిఎస్‌సిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్షిస్తున్న ఆర్‌డి పెనగంటి నాయుడు

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సులభతరమైన, మెరుగైన సేవలను పట్టణ ప్రజలకు త్వరితగతిన అందజేయాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం ఆర్‌డి పెనుగంటి నాయుడు.. వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారి పి.ప్రమీలరాణి, వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణానికి సంబంధించిన అనధికార భవన నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అనధికార, అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి, చర్యలు చేపడతామని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్లానింగ్ అధికారులు, ప్రయివేట్ లైసెన్స్ ప్లానర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో 3 నెలల వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఇందుకోసం ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున నాలుగు నియోజకవర్గాల్లో 480 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదో తరగతి విద్యార్హత తప్పనిసరని, అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గాల వారీ శిక్షణ ఇచ్చే ప్రదేశాలు, కార్యక్రమాల వివరాలు

పార్వతీపురం నియోజకవర్గంలో ఎం.ఆర్.నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇస్తారు. ఇతర వివరాలకు 91772 97528 నంబరును సంప్రదించాలి.

కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్, రిసెప్షనిస్ట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. మరిన్ని వివరాలకు 63034 93720 నంబరును సంప్రదించాలి.

పాలకొండ నియోజకవర్గంలో సీతంపేటలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో శాంప్లింగ్ టైలర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు శిక్షణ ఇస్తారు. వివరాలకు 88976 77564 నంబరును సంప్రదించవచ్చు.

సాలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇతర వివరాలకు 73825 59022 నంబరును సంప్రదించాలి.

టీకా వివరాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆరోగ్య శాఖ డిపిఒ జగన్‌మోహనరావు

సార్వత్రిక టీకా కార్యక్రమంలో పిల్లలకు వేసిన ప్రతీ టీకా వివరాల నమోదు తప్పనిసరి ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. ఎంఆర్ నగరంలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు, గర్భిణులకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా? అని రికార్డులు పరిశీలించారు. పిల్లల వయస్సు బట్టి వేయాల్సిన అన్ని టీకాలు కచ్చితంగా పూర్తి చేసి యువిన్, ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తద్వారా టీకా కార్యక్రమ తీరు పర్యవేక్షణ పక్కాగా ఉండటమే గాక అవసరమైనప్పుడు వ్యాక్సిన్ సర్టిఫికెట్ కూడా జెనరేట్ చేసి అందజేయవచ్చని తెలియజేశారు. టీకా నిర్వహించేటప్పుడు ఉండాల్సిన హబ్ కట్టర్, ఎఇఎఫ్ఐ కిట్ పరిశీలించారు. వ్యాక్సిన్ వేసిన తరువాత కొంత సమయం అక్కడే పర్యవేక్షణలో ఉంచాలన్నారు. టీకా అర్హుల జాబితా, గడువు తేదీల కార్డుల నిర్వహణకు సంబంధించిన టిక్లర్ బ్యాగ్‌ను వినియోగిస్తున్న తీరుపై అక్కడ పరిశీలించారు. గృహ సందర్శనలు చేసి ఎప్పటికపుడు పిల్లలు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, ఎఎన్ఎం డి.పోలమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావు, కృష్ణారావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజన ఉద్యమకారులు, సిపిఎం నాయకులు కామ్రేడ్ తాడంగి వెంకట్రావు, కృష్ణారావు ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు కోరారు. కామ్రేడ్ వెంకట్రావు, కృష్ణారావు 12వ వర్థంతి సభ మండలంలోని గొరడ గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో వెంకట్రావు, కృష్ణారావు కృషి ఎంతగానో ఉందన్నారు. వారి పోరాటాలు, ఉద్యమాలు ఈ ప్రాంత ప్రజల్లో స్ఫూర్తిని నింపాయన్నారు. వారి స్ఫూర్తితో రానున్న రోజుల్లో గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు మరిన్ని పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండంగి శ్రీనివాసరావు, కడ్రక రామస్వామి, మండల నాయకులు పువ్వల తిరుపతిరావు, వెంకట్రావు, కృష్ణారావు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాడంగి వెంకట్రావు, కృష్ణారావు స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ఒంటరి వ్యక్తులకూ రేషన్ కార్డు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఒంటరి వ్యక్తులకూ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తహశీల్దార్ ఎన్‌వి రమణ తెలిపారు. వితంతువులకు, పూర్తిగా పెళ్లి లేకుండా ఒంటరిగా ఉన్న వ్యక్తులకు, తల్లిదండ్రుల వద్దే ఉండి వారు మరణించాక ఒంటరిగా ఉన్న వ్యక్తులకు రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందని చెప్పారు. దీనికోసం అర్హులైన ప్రతిఒక్కరూ గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

జెసి వ్యాఖ్యలపై కార్యదర్శుల ఆవేదన

ప్రజాశక్తి-మక్కువ

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్షలో జాయింట్ కలెక్టర్ చేసిన వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత కోరుతూ ఎంపిడిఒ స్వరూపరాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై జిల్లా అధికారుల ఉంచి స్పష్టత వచ్చేవరకు గ్రామపంచాయతీ విధులు, సచివాలయ పరిధిలో వారికి కేటాయించిన క్లస్టర్ పరిధిలోని పనులు మాత్రమే నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఐ రమేష్, కె.సురేష్, ఎం.శంకర్, వేణు గోపాల్, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జూన్ నెలాఖరికి ఇంకుడు గుంతలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఇంకుడు గుంతలు పనులను జూన్ నెలాఖరికి పూర్తి చేయాలని ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీహరి... ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కంప్యూటర్ రూమ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 600 వరకు ఇంకుడు గుంతలు పనులు చేపట్టాలని లక్ష్యాలు విధించామన్నారు. ఇంతవరకు 90 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. లక్ష్యాలు చేరుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. 100 ఎకరాల్లో జీడి, మామిడి, పామాయిల్, కొబ్బరి, జామి, సపోటా, తదితర పంటలు పండించేందుకు లక్ష్యాలు పెట్టుకున్నామని, ఇంతవరకు 41 ఎకరాలు గుర్తించామని చెప్పారు. నీటి కుంటల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇంజినీరింగ్ కన్సల్టేషన్ కృష్ణప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

సీతంపేట ఎంపిడిఒగా మిశ్రా

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఎంపిడిఒగా బిబి విజయభాను మిశ్రా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పొందూరు ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన టి.కృష్ణారావు పాలకొండ డిప్యూటీ ఎంపిడిఒగా వెనక్కి వెళ్లిపోయారు.

బొడ్డమానుగూడలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ముమ్మరంగా స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలోని బొడ్డమానుగూడ, ఉరిడి, దూళికుప్ప గ్రామాల్లో వైద్య సిబ్బంది బుధవారం ముమ్మరంగా ఐఎంఆర్ఎస్ స్ప్రేయింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల గిరిజనులకు ప్రతిఒక్కరూ ఇంటిలో స్ప్రేయింగ్ చేయించుకోవాలని సూచించారు. అలాంటప్పుడే మలేరియా దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు నాగేశ్వరరావు, కేశవరావు, భారతి, హెల్త్ అసిస్టెంట్స్ జె.తిరుపతిరావు, ఆనందరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - కురుపాం

విత్తన బంతులు సాగు చేయడం వల్ల భూమికి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలో దురిబిలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు. అవి పొలంలో వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్లు బి.శ్రీరామ్, నరేష్, ప్రసాద్, రైతులు నాగేశ్వర్రావు, రమేష్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎస్‌బిఐ బ్రాంచిలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా సిబ్బందికి, ఖాతాదారులకు వివరించారు. కార్యక్రమములో బ్యాంకు మేనేజర్ యలమంచిలి సత్తిబాబు, సిబ్బంది ఎం.శ్యామలరావు, టి.రాజా, సిహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

చిరస్మరణీయుడు అల్లూరి

సీతారామరాజు వర్ధంతి సభలో ఇన్‌ఛార్జి కలెక్టర్ శోబిక

అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శోబిక, అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం

విప్లవ జ్యోతి, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక కొనియాడారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాట పటిమ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. గిరిజనుల అణచివేతను వ్యతిరేకించిన అల్లూరి.. విప్లవ జ్వాలను రగిలించిన మహా పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్.రాధాకృష్ణమూర్తి, పర్యవేక్షకులు శ్రీరామమూర్తి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎపిఒ జి.చిన్నబాబు, ఎఒ సునీల్, ఇతర అధికారులు నివాళులర్పించారు.

బలిజిపేట : మండలంలో పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఆ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు నివాళర్పించారు. కార్యక్రమంలో యువత కోట గౌరీనాథ్, కోట చందు, తుమరాడ మురళి, మచ్చ సత్యంనాయుడు, గోపి, గౌరీ, తాతబాబు, వెంకట్ నాయుడు, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి

సాలూరు రూరల్ : స్వాతంత్ర్య పోరాటంలో చిన్న వయసులోనే అల్లూరి సీతారామరాజు ప్రాణాలను త్యాగం చేశారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర తెలిపారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా రాజన్నదొర క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజును స్మరించే ప్రతి మనసులో ఆయన ఆశయం కలకాలం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

కొమరాడ : అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభను రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బల్లపాడు గ్రామంలో నిర్వహించారు. గిరిజన కళాకారుల నృత్య రూపకాలు, డప్పు డాన్సులతో ఆకట్టుకున్నారు. కమిటీ సభ్యులు కద్రక వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విగ్రహాలు పెట్టి జయంతి, వర్ధంతి సభలు జరిపి గిరిజనుల ఓట్ల కోసం కొంతమంది నాటకాలు ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనునాయుడు, నాయకులు మోనంగి భాస్కరరావు, పి.అసిరి, హిమారిక విన్నారావు పాల్గొన్నారు.

కురుపాం : జియ్యమ్మవలస మండలం టికె జమ్ము గ్రామంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి సర్పంచ్ అడ్డాకుల భారతి పూలమాల లేసి నివాళులర్పించారు. ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గిరిజన యువత శంకరరావు, రాంప్రసాద్, కైలాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండల పరిధిలో నాగూరు గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కొప్పల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధు పూలమాల వేసి నివాళులర్పించారు.

పాచిపెంటలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం, సిఐటియు నాయకులు

అల్లూరి స్ఫూర్తితో అడుగులు వేద్దాం

పాచిపెంట : పాచిపెంట మండలం కేంద్రంలో బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.చిన్నారావు, రైతు ప్రతినిధి సురేష్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఎం.వసంతరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాలూరు, సీతంపేట, బలిజిపేటలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, సీతంపేట ఐటిడిఎ అధికారులు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకు సంజీవనాయుడు, తదితరులు

వాడీవేడిగా మండల సమావేశం

'ఉపాధి'లో అక్రమాలపై అధికారులను నిలదీత

ప్రజాశక్తి-సాలూరు రూరల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి అధ్యక్షతన ఎంపిపి జి.రాములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఉపాధిలో అక్రమాలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి పనులు, కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని భగ్గుమన్నారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ మాట్లాడుతూ వేతనదారుల వద్ద ప్రతి వారం ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు వసూలు చేస్తున్నారని, అయినా వారిపై చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. గతంలో పెదపదం ఫీల్డ్‌అసిస్టెంట్ 10 మంది పేర్లు అదనంగా రాసి డబ్బులు డ్రా చేయడంతో విచారణ చేపట్టి, తొలగించారని గుర్తుచేశారు. కానీ కొత్తగా నియమించిన ఫీల్డ్‌అసిస్టెంట్ గ్రామంలో లేని, వివిధ వృత్తుల్లో ఉన్న వ్యక్తుల పేర్లను నమోదు చేసి వారికి కూడా వేతనాలను ఇస్తున్నారని తెలిపారు. దీనిపై ఏం చేశారని ఎపిఒ రామకృష్ణ నాయుడును ప్రశ్నించారు. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే విచారణ చేపట్టి, తొలగిస్తామని ఎపిఒ సమాధానమిచ్చారు.

ఇదే విషయంపై శివరాంపురం ఎంపిటిసి కల్లేపల్లి త్రినాథ నాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీలో ఏం పనులు జరుగుతున్నాయో, ఎక్కడ జరుగుతున్నాయో సర్పంచులు, ఎంపిటిసిలకు తెలియకుండా, తీర్మానాలు లేకుండా, వారికి నచ్చిన విధంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా చేసుకుంటూ పోతే స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులకు విలువేమిటని మండిపడ్డారు. సర్పంచుల తీర్మానాలు తీసుకునే పనులు చేపడుతున్నామని ఎపిఒ సమాధానమిచ్చారు. అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకంగా కాదని, ఎక్కడైనా పనులు చేపడితే సర్పంచి, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వాలని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ కోరారు. దీనికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అలా కాకుండా పూర్తిగా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఏ కార్యక్రమం నిర్వహించినా.. సహకరించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. సంపంగిపాడు సర్పంచ్ చంద్రయ్య మాట్లాడుతూ గిరిశిఖర గ్రామాలలో ఉపాధ్యాయులు సరైన సమయంలో రావడం లేదని, వచ్చినా సరిగా చదువు నేర్పించడం లేదని, దీనిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఇఒ ఎన్.వెంకటరావు స్పందిస్తూ ఏ ఒక్క ఉపాధ్యాయుడు సమయానికి పాఠశాలకు చేరకపోయినా, విద్యార్థులకు సరైన విద్యాబుద్ధులు నేర్పకపోయినా సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముందుగా వ్యవసాయ శాఖ మండల అధికారి అనురాధ పండా, విద్యుత్ శాఖ ఎఇ నాగేశ్వరరావు శాఖాపరమైన నివేదికలను వివరించారు. సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, తహశీల్దార్ ఎన్‌వి రమణ. తోణాం, బాగువలస వైద్యాధికారులు అనిల్, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నివేదికను వివరిస్తున్న అధికారి

ఐసిడిఎస్ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని బుధవారం అంగన్వాడీ యూనియన్ నాయకులు జె.సరోజ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల హక్కుల సాధన కోసం అన్ని కార్మిక సంఘాలతోపాటు తాము కూడా సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శోభారాణి, సూర్యకుమారి, రాణి, సరస్వతి, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్మికులు

సమ్మెలో మేము సైతం..

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 20న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నామని పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.కుమార్ వర్మకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించి ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్మికులు, ఉద్యోగులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు జలుమూరు గౌరు, కింతలి ఆనంద్, గొడ్డు బలరాం, జలగడుగల మజ్జి గౌరీ, మూడడ్ల సీతమ్మ పాల్గొన్నారు.

సక్రమంగా చెత్త సేకరణ

కొమరాడ.. కుమ్మరిగుంట ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న డిపిఒ కొండలరావు

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి కె.కొండలరావు సూచించారు. బుధవారం మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింట చెత్త సేకరణను పరిశీలించారు. ముందుగా తడి, పొడి చెత్త సేకరణపై, ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌డబ్ల్యుపిసి పనితీరు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సర్పంచ్ గొర్లె లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి అలమండ శ్రీను, డిపిఆర్‌సి సిబ్బంది పడాల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సంపద కేంద్రాల ద్వారా ఆర్థిక సేకరణకు ప్రజలు సహకరించాలని ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ అన్నారు మండలంలోని నిడగల్లు గ్రామంలో ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పి ధనలక్ష్మి పాల్గొన్నారు.

కురుపాం : పి.లేవిడి గ్రామాన్ని స్వచ్ఛ సుందరీకరణగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పంచాయతీ కార్యదర్శి బి.మిన్నారావు అన్నారు. బుధవారం చెత్త సేకరణ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చిమొక్కలని తొలగించి పరిశుభ్రంగా తయారు చేశారు.

సీతంపేట : కుసిమి పంచాయతీ ప్రజలకు తడి, పొడి చెత్త పై సర్పంచ్ సవర కూర్మారావు, కార్యదర్శి రాజారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ పక్కా రహదారి

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం జియ్యమ్మవలస ఆర్అండ్‌బి రహదారి నుండి గెడ్డతిరువాడ పంచాయతీ చిలకలవానివలస మీదుగా పసుపువానివలస వరకు రూ.1.65 కోట్లతో మంజూరైన బిటి రహదారి నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యం మరింత మెరుగు పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, దాసరి రామారావు, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, దంగభద్ర సర్పంచ్ జోగి భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రోడ్డు ప్రమాదంలో మరణించిన జియ్యమ్మవలస మండలం వనిజ గ్రామానికి చెందిన విఆర్ఒ నిమ్మక విజయానంద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లా రాంబాబు, నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, అక్కేన మధుసూదన్ రావు, అంబటి రాంబాబు, ఎంపిపి బొంగు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గిరిజన అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. బుధవారం సీతంపేట మండలంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టారు. మల్లి గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.48 లక్షలతో నిర్మించిన గిరిజన గురుకుల పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. జిల్లేడుపాడులో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీని, పశువుల కోసం నీటి తొట్టెను ప్రారంభించారు. శంభం, వాభ గ్రామాల్లో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ బిడ్డిక సంధ్యారాణి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, ఐటిడిపి సీతంపేట కోఆర్డినేటర్ ఇమరక పవన్, ఇమరక ప్రసాద్, మల్లయ్య, జనసేన రాజేష్, తదితరులు పాల్గొన్నారు.